పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలను ఉద్దేశించి నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ సాంబమూర్తి హెచ్చరించారు. సోమవారం సిబ్బందితో సమావేశమయ్యారు. మొదటి సర్కిల్ కు చెందిన పారిశుధ్య పర్యవేక్షకులు, పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో ఉదయం పూట పారిశుధ్య విధానంలో తప్పనిసరిగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని, సేకరించిన తడి చెత్తను పాలాసుపత్రికి అందజేయాలని చెప్పారు. మధ్యాహ్నం తప్పనిసరిగా కాలువలలో పూడికతీత పనులను చేపట్టాలని తెలిపారు. ప్రతి సచివాలయాన్ని తరచూ సందర్శిస్తామని విధులు పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్లయితే అట్టివారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శేషగిరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం, శేషగిరి తల్లి సూర్యకాంతం, యుటిఎఫ్ నాయకులు : సభకు హాజరైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు

యుటిఎఫ్ బలోపేతమే శేషగిరికి నివాళి

కామన్ విద్యా విధానంతోనే పేదలకు మెరుగైన విద్య ● వర్ధంతి సభలో పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడ్ విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'ఏ కోణంలో చూసినా పరిణితి చెందిన నాయకత్వ లక్షణాలు గల వ్యక్తి శేషగిరి. ఉపాధ్యాయులు విరాళాలు ఇచ్చి విజ్ఞాన కేంద్రం నిర్మాణం చేయడం రాష్ట్రంలో ఎక్కడా లేదు. ఆ గౌరవం శేషగిరికి దక్కడం గర్వంగా ఉంది. సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేయడమే శేషగిరికి నివాళి' అని శాసనమండలి పిడిఎఫ్ మాజీ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. యుటిఎఫ్ నాయకులు కోరెడ్ల శేషగిరి 3వ వర్ధంతి సభ సోమవారం కెఎల్ పురంలోని శేషగిరి విజ్ఞానకేంద్ర భవనంలో జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్ర పట్నాయిక్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బాల సుబ్రహ్మణ్యంతో పాటు శేషగిరి తల్లి సూర్య కాంతం, కుటుంబ సభ్యులు, యుటిఎఫ్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజాశక్తి ముద్రించిన ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'విద్యారంగంలో పరిణామాలు.. సవాళ్లు.. కర్తవ్యాలు' అనే అంశంపై బాల సుబ్రహ్మణ్యం స్మారకోపన్యాసం చేశారు. కామన్ విద్యా విధానంతోనే పేదలకు మెరుగైన విద్య అందుతుందని అన్నారు. కామన్ స్కూల్స్ విధానం అమలు చేయాల్సిన ప్రభుత్వాలు ఎన్నికల్లో ఓట్లకోసం పథకాలను మాత్రమే ఆశగా చూపుతున్నాయని విమర్శించారు. దీనివల్ల అంతిమంగా నష్టపోయేది పేదలు, వారి పిల్లలేనన్నారు. నిరుపేదలు మాత్రమే చదువుకునే పాఠశాలలు ఉంటే వారికి ఏమి కావాలో అడగలేరని, అటువంటి విద్యా వ్యవస్థలో అభివృద్ధి కూడా ఉండదని అన్నారు. సమాజంపై అవగాహన కలిగించే విద్య ఉండాలన్నారు. దేశంలో అందరూ ఒకే గొడుకు కింద చదివే కామన్ విద్యా విధానం అవసరమన్నారు. ఈ విద్యా విధానం ద్వారానే అంతరాలు లేని సమాజానికి రూపకల్పన జరుగుతుం దన్నారు. నేడు విద్యా విధానం కులాల పేరుతో పాఠశాలలు ఏర్పడి ముక్కలు ముక్కలుగా మారిపోయిందని ఆవేదన చెందారు. నేడు మన రాష్ట్రంలో విద్యా వ్యాపారం జరుగుతోందన్నారు. వ్యాపార వేత్తలు ఢిల్లీలో సమావేశమై విద్యా రంగం ద్వారానే ఎక్కువ లాభం వస్తుందనే నిర్ణయానికి వచ్చాయంటే విద్యా వ్యాపారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలన్నారు. నేడు మన రాజకీయ నాయకులలో 60 నుంచి 70 శాతం మందికి విద్యా వ్యాపార సంస్థలు ఉన్నాయన్నారు. నేడు ప్రైవేటు విద్యా వ్యాపారవేత్తలు ఎమ్మెల్సీలుగా, ఎమ్మెల్యేగా, ఎంపీలుగా అన్నారు. రాష్ట్రంలో 1200 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఉపాధ్యాయులు గ్రహించాలన్నారు. పేదలకు చదువు చెప్పే ప్రభుత్వ బడి లేకపోతే మనం ప్రజలకు వ్యతిరేకంగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. మన గౌరవాన్ని, భవిష్యత్ ను నిర్ణయించేది బడి పిల్లలు మాత్రమేనని, మనం, జనం కలిసి ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని అన్నారు. ప్రభుత్వ విద్యను కాపాడుకునే విధంగా ముందుకు సాగాలన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన శేషగిరిని స్ఫూర్తిగా తీసుకొని విద్యారంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులతో కలిసి సెమినార్లు పెట్టి సమాజంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచే ప్రయత్నంలో ఆయన కృషి అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ రావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలను నడపడంలో దిట్ట శేషగిరి అన్నారు. స్టడీ సర్కిల్స్ నిర్వహించడంలో రాష్ట్రానికే మన జిల్లాను ఆదర్శంగా నిలిపారని తెలిపారు. ఆయన అందించిన స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు చేపట్టాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ శేషగిరి స్ఫూర్తితో యుటిఎఫ్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా శేషగిరి విజ్ఞాన కేంద్రానికి పది వేలు విరాళం ప్రకటించారు. బిఇడి కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ శర్మ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్న శేషగిరి మరణం యుటిఎఫ్‌కు తీరని లోటని అన్నారు. తాను విద్యా శాఖలో, జెడ్‌పి కార్యాలయంలో పని చేసినప్పుడు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం చేయించుకోవడంలో శేషగిరి చూపిన చొరవ స్ఫూర్తి దాయకం అన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, కె.శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఎపిటిఎఫ్ (257) నాయకులు శ్రీనివాసరావు, పిఆర్‌టియు నాయకులు బి.శివప్రసాద్, ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస, మన్యం జిల్లా అధ్యక్షులు రమేష్, అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, శ్రీకాకుళం జిల్లా నాయకులు శేషగిరితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సదస్సులో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాజాగా మరొకరు మృతి
ఇప్పటికే పలువురు ఆస్పత్రిపాలు

విజృంభిస్తున్న వీధికుక్కలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలో ఇటీవల కాలంలో వీధి కుక్కలు విజృంభిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఓ వృద్ధురాలిని పొట్టన పెట్టుకున్న వీధి కుక్కలు తాజాగా సోమవారం మరో వ్యక్తిపై దాడి చేసి చంపేశాయి. దీంతో మండల ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లే వారిపై కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల వెంకటరాజపురానికి చెందిన బంటు లక్ష్మి అనే వృద్ధురాలు బహిర్భూమికి వెళ్లగా కుక్కల గుంపు ఒక్కసారిగా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృత్యువాత పడిన విషయం మరవక ముందే సోమవారం ఉదయం బిత్తరపాడుకు చెందిన నీరస శంకర్రావుపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. అనంతరం మరో వ్యక్తి సీర శంకర్రావు పై కూడా దాడి చేయగా ఆయన తీవ్రంగా గాయ పడ్డాడు. ప్రస్తుతం ఆయన చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇటీవల కుక్కల దాడుల్లో తీవ్రంగా గాయపడిన గొడవ సరోజిని, గంట లక్ష్మి , గౌరీపురం గ్రామానికి చెందిన పల్లవి అనే చిన్నారి ఇప్పటికే చికిత్స పొందుతున్నారు. అంతేకాకుండా పశువులు, గొర్రెలను కూడా పొట్టను పెట్టుకున్న ఈ కుక్కల గుంపుపై చర్యలు తీసుకునేందుకు అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఏనుగుల దాడిలో తమ ప్రాణాలను కోల్పోయి పంట నష్టాన్ని భరిస్తూ ఏళ్ల తరబడి నష్టాన్ని చవిచూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కలను, ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, లేకుంటే మరెన్నో ప్రాణాలు కోల్పోవడం ఖాయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల దాడిలో మృతి చెందిన నీరస శంకర్రావు కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని బిత్తరపాడు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మృతి చెందిన శంకర్రావుకు భార్య చంద్రకళ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

కుక్కల దాడిలో గాయపడ్డ లక్ష్మి (ఫైల్)

తప్పని డోలీ మోతలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని గిరిశిఖర గ్రామాల ప్రజలకు అనారోగ్యం చేస్తే డోలీ మోతలు తప్పడం లేదు. ఎన్నేళ్లయినా గిరిజన గ్రామాలకు పాలకులు రహదారి సౌకర్యం కల్పించక పోవడంతో గిరిజనులకు ఈ దుస్థితి తప్పడం లేదు. తాజాగా సోమవారం బొడ్డవర పంచాయతీ చిట్టంపాడు గ్రామంలో కేరంగి లక్ష్మి (21) గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో భర్త కేరంగి బంగారయ్య తోటి బంధువుల సహాయంతో 7 కిలోమీటర్ల దూరం డోలీ సాయంతో కొండ దిగువన గల మెట్టపాలెం గ్రామం వరకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచి ఎస్.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు లక్ష్మి భర్త బంగారయ్య తెలిపాడు. ప్రస్తుతం లక్ష్మీ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

గర్భిణీని డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న గిరిజనులు

ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాల అమ్మకాలు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన పట్టివేత :: సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్న నారాయణ, చైతన్య పాఠశాలల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ విద్యార్థులను నిలువు దోపిడీ చేయడానికి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాల అమ్మకం చేపడుతున్నాయని అన్నారు. విద్యార్థులు , తల్లిదండ్రుల నుంచి వచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చైతన్య, నారాయణ పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్న రూముల్ని గుర్తించామని తెలిపారు. ఇప్పటికే ట్యూషన్ ఫీజుల రూపంలో 40 నుంచి 60 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలో ఇప్పుడు పుస్తకాలు, యూనిఫాంల రూపంలో అదనంగా మరో 20 వేల రూపాయలు వరకు వసూలు చేస్తున్నాయని తెలిపారు. తక్షణమే ఇలా జిల్లా వ్యాప్తంగా పుస్తకాలు అమ్ముతున్న కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలని, వాటి లైసెన్స్ లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ఆర్థిక స్థితిని దృష్టిలో ఉంచుకొని పుస్తకాల అమ్మకాన్ని ఆపాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇదేవిధంగా పాఠశాలల పుస్తకాలను అమ్ముతున్న రూములను సీజ్ చేయించి పాఠశాలల లైసెన్సులు రద్దు చేసేలా పోరాడుతామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకుల ఫిర్యాదు మేరకు డిప్యూటీ డిఇఒ కెవి రమణ అక్కడికి వచ్చి చైతన్య , నారాయణ పాఠశాలలో పుస్తకాలు అమ్ముతున్న రూమ్‌లను సీజ్ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, పి. రమేష్, జిల్లానాయకులు డి.వెంకటరమణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నారాయణ స్కూలులో పుస్తకాల గదిని సీజ్‌చేస్తున్న డిప్యూటీ డిఇఒ

భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గిరిజనులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కారం చేయాలని ఎపి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తొక్కుడువలసలో గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 9గ్రామాల గిరిజనులు గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చేసిన సిపిఎం జిల్లాకార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని, కావున మన హక్కుల పరిష్కారానికి ఆదివాసీలంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. స్థానికంగా గిరిజనులు 900 ఎకరాలు డి పట్టా భూములు గంగాపురం పంచాయతీలో తొక్కుడువలస, పనసభద్ర, పిడిలోవ, వెలగవలస, నందివలస, లక్ష్మణదొరవలస గ్రామాల్లో 30, 40 ఏళ్లుగా సాగు చేస్తున్నా పట్టాలు ఇవ్వలేదన్నారు. ఈ భూములు వారిని కాదని కొంతమంది గిరిజనులను అధికారులు భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేసి సాగు చేస్తున్న భూములకు పట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని, సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు మాట్లాడుతూ మన సమస్యల పరిష్కారానికి సంఘాలు పెట్టి ఐక్యంగా పోరాడాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.రాము, డివైఎఫ్ఐ నాయకులు వెంకటరమణ గిరిజన సంఘం నాయకులు బలరాం, శ్రీను, వరలక్ష్మి, రైతు సంఘం నాయకులు సత్యనారాయణ, అప్పలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఓట్లను లెక్కింపు ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే మైక్రో అబ్జర్వర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలను వివరించారు. లెక్కింపు కేంద్రాల్లోని ప్రతీ టేబుల్ వద్దా మైక్రో అబ్జర్వర్లను నియమిస్తామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత వీరిపై ఉందన్నారు. ఏమైనా తేడాలను గుర్తిస్తే వెంటనే పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, ఇతర లెక్కింపు సిబ్బంది ప్రతీ రౌండ్‌కు పోలైన ఓట్ల వివరాలను ఆర్ఒలకు అందజేస్తారని, ఇదే సమయంలో మైక్రో అబ్జర్వర్లు ఓట్ల వివరాలను అబ్జర్వర్లకు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. మొత్తం ప్రక్రియ అంతా సజావుగా, పారదర్శకంగా పూర్తి చేయాల్సిన బాధ్యత కూడా అబ్జర్వర్లపై ఉందన్నారు. లెక్కింపు ప్రక్రియలో ప్రతీ దశా కీలకమేనని స్పష్టం చేశారు. కౌంటింగ్ సిబ్బందిని, ఏజెంట్లను కూడా గమనించాల్సిన బాధ్యత వీరిపై ఉందన్నారు. ఆర్ఒ టేబుల్ దగ్గర నియమితులయ్యే ఇద్దరు మైక్రో అబ్జర్వర్లపై, రౌండ్ వారీ ఓట్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించాల్సిన బాధ్యత ఉందన్నారు. నిబంధనల మేరకు సజావుగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయడానికి మైక్రో అబ్జర్వర్లు కృషి చేయాలని కోరారు.

ట్రైనింగ్ నోడల్ అధికారి సుధాకరరావు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్ల విధులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కౌంటింగ్‌లో తలెత్తే న్యాయపరమైన అంశాలు, కౌంటింగ్ కేంద్రం, దానిలో ఏర్పాటు చేసే టేబుళ్లు, ప్రతీ టేబుల్‌కు నియమితులయ్యే సిబ్బందీ, పోస్టల్ బ్యాలెట్ కవర్ల పరిశీలన, నిరాకరణ, లెక్కింపు, ఇవిఎంలలో ఓట్ల లెక్కింపు, ఆ తరువాత చేపట్టాల్సిన చర్యలు, ఫలితాల ప్రకటన, పూర్తి చేయాల్సిన పత్రాలు తదితర అంశాలను వివరించారు. శిక్షణలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఎన్నికల సెల్ సూపరిటిండెంట్ ప్రభాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌తో చర్చిస్తున్న కర్రోతు బంగార్రాజు

భూ వివరాలపై కార్పొరేటర్ ఆరా

ప్రజాశక్తి-భోగాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి డి-పట్టా భూములను బినామీ పేర్లతో కొనుగోలు చేసినట్లు విశాఖకు చెందిన జనసేన కార్పొరేటర్ పీతల గురుమూర్తి యాదవ్ ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రధానంగా అంతర్జాతీయ విమానాశ్రయం చుట్టూ భూముల కొనుగోలు చేసినట్లు సిఎస్‌పై ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. మండలంలోని కంచేరు రెవెన్యూ పరిధిలోని డి-పట్టా భూములు కూడా ఉన్నట్లు మూర్తి ఆరోపించారు. ఈ నేపథ్యంలో పీతల గురుమూర్తి యాదవ్ సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయానికి వచ్చి తహశీల్దారు శ్యామ్ ప్రసాద్‌తో మాట్లాడారు. అయితే భూములకు సంబంధించిన వివరాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా విజయనగరం ఆర్‌డిఒ కార్యాలయంలో దరఖాస్తు చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిసింది. అనంతరం ఆరోపణలు చేసిన భూములను కూడా పరిశీలించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఆయనను నెల్లిమర్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు కలిశారు. నియోజకవర్గం పరిధిలోని భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో ఎక్కడెక్కడ బినామీలతో ఇలాంటి భూములు కొనుగోలు చేశారన్న విషయాలపై వీరు మాట్లాడుకున్నట్లు తెలిసింది. దీనిపై తాము కూడా ఇక్కడ పోరాటాలు చేస్తామని బంగా ర్రాజు చెప్పినట్లు తెలిసింది.

ఘనంగా కోలగట్ల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వైసిపి యువజన, విద్యార్థి విభాగం సంయుక్తంగా స్థానిక సుజాత ఫంక్షన్ హాలులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 273 మంది స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేసేందుకు ముందుకు వచ్చారు. వివిధ బ్లడ్ బ్యాంకుల ప్రతినిధులు రక్త సేకరణకు సహకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవికాలంలో రక్తనిధి కేంద్రాలలో రక్త నిల్వలు తక్కువగా ఉంటాయని ఈ పరిస్థితుల్లో కోలగట్లపై ఉన్న అభిమానంతో పలువురు రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ప్రజాహితాన్ని కోరుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎల్లవేళలా అవసరమైన వారికి సేవలందిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి తన ప్రజాసేవను మరింత విస్తత పరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్చార్జిలు, కార్యకర్తలు, కోలగట్ల అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రక్తదాతను అభినందిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

కారు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

మృతుల్లో రిటైర్డు జడ్జి మోహన్‌కుమార్, కారు డ్రైవర్ శ్రీనివాస్
ప్రదీప్‌నగర్, విటి అగ్రహారంలో విషాదం



జిల్లా విశ్రాంత జడ్జి మోహన్‌కుమార్, కారు డ్రైవర్ శ్రీనివాస్ (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం కోట

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం సమీప జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయ నగరానికి చెందిన విశ్రాంత జడ్జి వి.మోహన్‌కుమార్(65), ఆయన కారు డ్రైవర్, విటి అగ్రహానికి చెందిన దొంతల శ్రీనివాస్ (35) దుర్మరణం చెందారు. ఈ ఘటనతో వారు నివాసముంటున్న ప్రదీప్‌నగర్, విటి అగ్రహారంలో విషాదఛాయలు అలముకున్నాయి. వీరు ప్రయాణిస్తున్న కారును కెవిఆర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీకొనడంతో ఆ తీవ్రతకు ఆ కారు రహదారి పక్కన ఆగి ఉన్న కర్రల లోడు వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మోహన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, కొన ఊపిరితో ఉన్న శ్రీనివాస్‌ను స్థానికులు అంబులెన్సులో తరలిస్తుండగా కన్నుమూశాడు. వీరి మృతదేహాలకు పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం విజయనగరం చేరుకున్నాయి. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరు మున్నీరయ్యారు.

మోహన్‌కుమార్ ప్రకాశం జిల్లా న్యాయస్థానంలో అదనపు జిల్లా జడ్జిగా పనిచేసి ఉద్యోగ విరమణ చెందారు. విజయనగరం జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులరేటరీ అథారిటీ (రెరా) అధికారిగా విజయవాడ కేంద్రంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మోహన్‌కుమార్ ప్రతినెలా నాలుగైదురోజులు విజయవాడ వెళ్లి వస్తుంటారు. ఈనేపథ్యంలో విటి అగ్రహారానికి చెందిన డి.శ్రీనివాస్‌ను ఆప్టింగ్ డ్రైవర్‌గా తీసుకెళ్తుండేవారు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం ప్రదీప్‌నగర్ నుంచి విజయవాడకు బయలుదేరారు.

శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ పదో తరగతి వరకు చదువుకొని అనంతరం అరుణా జ్యూట్‌మిల్లులో కార్మికుడిగా పనిచేశాడు. ఎఐసిటియు నాయకుడు ఎస్.గంగాధర్‌రెడ్డి నాయకత్వంలో కార్మిక సమస్యలపై పనిచేశాడు. జ్యూట్‌మిల్లు మూతపడిన తరువాత ప్రజాశక్తి విలేకరిగా కొంత కాలం పనిచేశాడు. ఆ తరువాత కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆయన మృతికి ఎఐసిటియు అధ్యక్షులు జెవి కైలాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దల్లి అప్పలరెడ్డి, సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు, ప్రజాశక్తి జిల్లా కన్వీనర్ కె.రమేష్ నాయుడు, డెస్క్ ఇన్‌ఛార్జి పి.అప్పారావు సంతాపం తెలిపారు.



ప్రమాదానికి గురైన కారు

గుండెపోటుతో గోవిందనాయుడు మృతి

ప్రజాశక్తి- బొబ్బిలి

గాయత్రి జూనియర్ కళాశాల, పాఠశాల కరస్పాండెంట్ పోల గోవిందనాయుడు ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఇంటిలో నిద్రిస్తుండగా గుండెపోటు రావడంతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కళాశాల, పాఠశాలలో పేద విద్యార్థులను ఉచితంగా చదివించడంతో పాటు అనేకమంది విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇచ్చి చదివించి ఉన్నతులుగా తీర్చిదిద్దారు. గోవిందనాయుడు కళాశాల, పాఠశాల యాజమాన్యాల అసోసియేషన్‌లో కీలకపాత్ర పోషించి సమస్యలు పరిష్కారానికి పని చేశారు. ఆయన మృతికి కళాశాల, పాఠశాల యాజమాన్యాల అసోసియేషన్ సభ్యులు రౌతు వాసుదేవరావు, ఎం.వేణుగోపాలనాయుడు, చింతా అప్పారావు, ఎస్. గౌరీశంకర్, ఎం.నాని, ఎస్.ఎఫ్.ఐ, ఎ.ఐ.ఎస్.ఎఫ్ నాయకులు మణికుమార్, రవికుమార్, అప్పన్న, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సొంత గ్రామం పిరిడిలో అంత్యక్రియలు నిర్వహించారు.

గోవిందనాయుడు మృతి పట్ల సంతాపం

గాయత్రి హై స్కూల్, జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ పైల గోవింద నాయుడు ఆకస్మిక మృతి పట్ల బొబ్బిలి రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ అధ్యక్షులు జెసి రాజు, కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి సింద్రీ శ్రీనివాసన్, ఫౌండేషన్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, మరిపి వేణుగోపాల నాయుడు తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. రోటరీ ఆధ్వర్యంలో నిర్వహించే విద్య సంబంధిత కార్యక్రమాలను, బేసిక్ ఎడ్యుకేషన్, అక్షరాస్యత పెంపుదల కార్యక్రమాలను కాలేజీలో నిర్వహించటానికి సహకరించారని, విద్యా బోధన, విద్యార్థుల క్రమశిక్షణ, విలువల పెంపుదల పై అధిక ప్రాముఖ్యతనిచ్చి ఉపన్యసించేవారని గుర్తు చేశారు. ఆయన ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. జూనియర్ కాలేజీల అసోసియేషన్ అధ్యక్షులుగా వారిసేవలు మరచిపోలేనివని ఆయన లేని లోటు పూడ్చలేనిదని అన్నారు.

'సీతం'లో నేటి నుంచి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి- విజయనగరం

సీతం కళాశాలలో నేటి నుంచి 2(ఎ) గర్ల్స్ బట్టలియన్ అన్నియల్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ అన్నియల్ ట్రైనింగ్ క్యాంప్ కమాండర్ కలనెల్ గోపెంద్ర ఆధ్వర్యంలో జరగనుంది. క్యాడెట్ల నైపుణ్యాలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే విధంగా ఈ శిక్షణ శిబిరం ఉంటుంది. వార్షిక శిక్షణ శిబిరం ఎన్‌సిసి క్యాడెట్‌ల కోసం పది రోజులు ఉంటుదని కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ పఠనం, ప్రథమ చికిత్స, సాహసం, ఆత్మరక్షణ, సైనిక చరిత్ర, శారీరక దృఢత్వం, ఫీల్డ్ క్రాఫ్ట్, యుద్ధ క్రాఫ్ట్ వంటి వివిధ అంశాలను నేర్చుకునేందుకు ఈ శిక్షణలో వీలుంటుందన్నారు. మూడు జిల్లాల నుంచి వచ్చిన ఎన్‌సిసి ఆఫీసర్స్, క్యాడెట్లను ఆయన సోమవారం కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమెండెంట్ కెప్టెన్ మీసాల సత్యవేని, సబ్డేర్ మేజర్ బొడ్డే, పరమేశ్వర్ సింగ్, అసోసియేట్ ఎన్.సి.సి ఆఫీసర్స్, మూడు జిల్లాల నుంచి 600 మంది ఎన్.సి.సి క్యాడెట్స్ పాల్గొన్నారు.

పుస్తక పఠనం ద్వారా విద్యా ప్రమాణాలు

ప్రజాశక్తి - కొత్తవలస

పుస్తకాలు పఠనం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరుగుతాయని స్థానిక లైబ్రేరియన్ ఎం. రామలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక లైబ్రరీలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు వివిధ క్రీడల పోటీలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిరంతరం నేర్చుకోవాలని, అప్పుడే తెలియని విషయాలు అర్థమవుతాయని చెప్పారు. అనంతరం కథలు పుస్తకాలు చదివించారు.

29,31న మిగులు సీట్లకు కౌన్సిలింగ్

నెల్లిమర్ల: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్లు భర్తీకి ఈనెల 29, 31న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. ఉషారాణి తెలిపారు. సోమవారం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో మిగులు సీట్లకు 29న, ఇంగ్లీష్ మీడియం ఇంటర్ ప్రథమ సంవత్సరం సిఇసి గ్రూపులో మిగులు సీట్లకు 31న కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సమన్వయ కర్త టి. పద్మజ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ జరుగుతుందని ఆసక్తి కలిగిన విద్యార్థులు టిసి, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ, ఆదాయ ధృవీకరణ పత్రాలతో ఉదయం 9.గంటలకు హాజరు కావాలని ఇంతక ముందు ప్రవేశ పరీక్ష రాసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

ఉపాధి పనులు పరిశీలన

గజపతినగరం: మండలంలోని కొనిస, కొత్తబగ్గం, గంగచోల్లపెంట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎపిఒ సి.హెచ్ రామారావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో కాసేపు ముచ్చటించారు. నిర్ణీత కొలతలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని దానికి తగిన వేతనం పొందాలని అన్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సింగరాయిలో రమాబాయి వర్ధంతి

వేపాడ: మండలంలోని సింగరాయి ఎస్‌సి కాలనీలో రమాబాయి వర్ధంతి సోమవారం నిర్వహించారు. ముందుగా బిఆర్ అంబేద్కర్ దంపతులు చిత్రపటానికి పూలమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గౌరీ, భారతి, కమల, పద్మ, మనీ, ధన తదితరులు పాల్గొన్నారు.

బటన్ నొక్కిన నిధులు ఏమైనట్టు?

బొబ్బిలి: జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన నిధులు బటన్ నొక్కి కొన్ని నెలలు కావస్తున్న తల్లుల ఖాతాలకి జమ కాలేదని ఆ నిధులు ఏమయ్యాయని పిసిసి అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కొన్ని నెలలుగా ఖాతాల్లో విద్యాదీవెన నిధులు జమ కాకపోవడం వల్ల ఫీజులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో విద్యార్థులు ఫీజులు కట్టలేక, సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపు నుంచి డిమాండ్ చేస్తున్నామన్నారు.

హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

హుండీ ఆదాయం రూ.5 లక్షలు

ప్రజాశక్తి- చీపురుపల్లి

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆదాయం రూ.5 లక్షలు వచ్చినట్లు ఆలయ ఇఒ జి శ్రీనివాసరావు తెలిపారు. మార్చి 23 నుంచి మే 27 వరకు భక్తుల నుండి వచ్చిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించామన్నారు. మూడు నెలల పాటు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ద్వారా రూ.5,00,435లు ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి ఛైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశ్ (గోవింద్), వైస్ ఛైర్మన్ సూరు వెంకట కుమారస్వామి, కంది శ్రీరాములు, వంకల కృష్ణ, సిహెచ్. వేణునాయుడు, హెచ్‌సి టి. సంతోష్ కుమార్, కానిస్టేబుల్ వి. భవాని, విఆర్‌ఒ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి జారిపడిన వ్యక్తి మృతి

శృంగవరపుకోట : మండలంలోని గోపాలపల్లి గ్రామానికి చెందిన ఒనుం సంతోష్ (36) కల్లు గీస్తూ ఆదివారం చెట్టు పై నుంచి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు అతన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సంతోష్ సోమవారం మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని గీత కార్మికుల సంఘ గౌరవాధ్యక్షులు పురం అప్పారావు, జిల్లా అధ్యక్షుడు కొల్లి అప్పారావు పరామర్శించారు. మృతునికి భార్య కోటమ్మ, తండ్రి ఆదినారాయణ ఉన్నారు.

నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- గజపతినగరం

ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు అమ్మినా, నకిలీ విత్తనాలు విక్రయించిన డీలర్లు పై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు అన్నారు. సోమవారం మార్కెట్ యార్డు ఆవరణలో గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో గల నాలుగు మండలాల డీలర్లకు, రైతు భరోసా సిబ్బందికి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌లో రైతులకు కావలసిన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు సకాలంలో తెప్పించి ప్రైవేటు డీలర్లు నియమ నిబంధనల మేరకు అమ్మకాలు చేపట్టాలన్నారు. అనుమతులు లేని బయో ఉత్పత్తులు అమ్మినా, అధిక ధరలకు ఎరువులను విక్రయించినా, రికార్డులు సరిగ్గా నిర్వహించకున్నా, తగు చట్టపరమైన క్రమశిక్షణ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఆర్‌బికెల పరిధిలో అవసరమైన రాయితీ విత్తనాలు, ఎరువులు ముందస్తుగానే నిల్వ ఉంచుకోవాలని, పంపిణీ చేసే ముందే మొలక శాతాన్ని పరీక్షించి మాత్రమే రైతులకు అందించా లని, కౌలు రైతులను గుర్తించి సిసిఆర్‌సి కార్డులు మంజూరు చేయాలని, సాగయ్యే ప్రతి పంటను ఈ పంట ద్వారా నమోదు చేపట్టాలని సూచించారు. అనంతరం లాంఛనంగా రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం సహాయ వ్యవసాయ సంచాలకులు కె.మహారాజన్, మండల వ్యవసాయాధికారులు గోకుల్ కృష్ణ, అనురాధ, మల్లికార్జున్, లోకేష్, నాలుగు మండలాల డీలర్లు ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు 46,531 క్వింటాళ్ల వరి విత్తనాలు

డెంకాడ : ఈ ఏడాది ఖరీఫ్‌కు జిల్లాలో 46,531 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని ఇప్పటి వరకూ 10,524 క్వింటాళ్ల వరి విత్తనాలను ఆర్‌బికెల్లో సిద్ధంగా ఉంచామని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.అన్నపూర్ణ, ఎ. నాగభూషణరావు తెలిపారు. మండలంలోని పెదతాడివాడ, పినతాడివాడ, డెంకాడ ఆర్‌బికెలను ఆమె సోమవారం సందర్శించారు. 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు అందబాటులో ఉన్నాయని రైతులు వాటిని వినియోగించు కోవాలని కోరారు. జిల్లాలో 2517 క్వింటాళ్లకు గాను 1497 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు ముందుగానే ఆర్‌బికెల్లో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఆర్‌బికెల్లో ఉన్న విత్తనాలను మొలక శాతం కట్టి రైతులకు సరఫరా చేయాలన్నారు. డెంకాడ మండల పరిధిలో 53 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేసినట్లు తెలిపారు. విత్తనాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ ఎస్. పద్మ తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి

రేగిడి: ఖరీఫ్ వ్యవసాయానికి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు నారు జనార్ధన రావు, పట్టాభిలు కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాములమ్మకు లిఖితపూర్వకంగా వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో అందించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేసి దిగుబడులకు సహకరించాలన్నారు. వ్యవసాయ సాగుకు కావలసిన పనిముట్లు అందజేసేలా కృషి చేయాలన్నారు. ఆధునిక యంత్రాలు కూడా 90 శాతం రాయితీతో ఇచ్చేలా చూడాలన్నారు. అపరాల పంటల విత్తనాలలో సంపద, అమూల్య, అజీమ్ వంటి విత్తనాలు ఇచ్చి రైతుల దిగుబడులకు సహకరించాలని కోరారు. తహశీల్దార్ స్పందించి వ్యవసాయ అధికారులకు, ప్రజాప్రతినిధులకు నివేదికలు పంపిస్తామన్నారు.

ఖరీఫ్‌కు 5985 క్వింటాళ్ల వరి విత్తనాలు

బొబ్బిలి: ఖరీగ్ సాగుకు రైతులకు వరి విత్తనాలు సరఫరా చేసేందుకు 5985 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాఖ ఏడి మజ్జి శ్యామసుందర్ చెప్పారు. బొబ్బిలి మండలానికి 1883, బాడంగి మండలానికి 1310, రామభద్రపురం మండలానికి 848, తెర్లాం మండలానికి 1944 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేసినట్లు చెప్పారు. 50శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేస్తున్నామని చెప్పారు. వరి విత్తనాలు కోసం రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని కోరారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు సరఫరాకు సిద్ధం

రామభద్రపురం: మండలంలో రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎఒ వి. వెంకటయ్య తెలిపారు. పిల్లిపెసర 8 కేజీల విత్తనాలు రాయితీపోను రూ.536లకు అందిస్తున్నామని, కట్టె జనుము 10 కేజీల పేకెట్ రూ. 440లకు అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ ఆర్‌బికె వద్ద 12 టన్నుల యూరియా, డిఎపి ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు 850 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు అందించడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. సాంబ మసూరి, సోనామసూరితో పాటు ప్రత్యేక రకం వరి విత్తనాలు సరఫరా చేస్తామని అన్నారు.

రాయితీ పై పచ్చిరొట్ట విత్తన పంపిణీ

బొండపల్లి: మండలంలోని నెలివాడ రైతు భరోసా కేంద్రంలో సోమవారం రాయితీ పై పచ్చిరొట్ట విత్తన పంపిణీని జిల్లా వ్యవసాయ అధికారి బిటి రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు రైతులకు అవసరమయ్యే అన్ని రకాల ఎరువులు, విత్తనాలు ముందస్తుగానే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పంపిణీ చేసే ముందుగా విత్తన మొలక శాతాన్ని పరీక్షించి పంపిణీ చేయాలన్నారు. మండలంలోని వివిధ రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉంచిన ఎరువులు విత్తనాల గురించి సమీక్ష చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గజపతినగరం వ్యవసాయ సహాయ సంచాలకులు కె.మహారాజన్, మండల వ్యవసాయ అధికారి మల్లికార్జునరావు, ఎఇఒ సంతోష్, వ్యవసాయ సహాయకులు అనిల్, రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: ఆర్‌బికెలో రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తహశీల్దార్‌కు పరస్పరం ఫిర్యాదులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని గుల్లపాడు పంచాయతీ పరిధి వండానపేట గ్రామానికి చెందిన సర్పంచ్ వియ్యపు లావణ్య చక్రపాణి, అదే గ్రామానికి చెందిన ముంజేటి పురుషోత్తమరావు మరి కొంతమంది గ్రామపంచాయతీ వనరులు, భూ అక్రమాలు, భూ దందాలు వంటివి వాటిపై తహశీల్దార్ రాములమ్మకు సోమవారం పరస్పర ఫిర్యాదులు చేశారు. ముంజేటి జగన్ మోహన్ రావు, ముంజేటి పురుషోత్తమరావు గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా ఎస్‌సి కులానికి చెందిన డిపట్టా భూములు కొనుగోలు చేసి పక్కా భవనాలు కట్టి అద్దెకు ఇస్తున్నారని సర్పంచ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా పంచాయతీ పనులు రసీదులు, అప్రూవల్ లేకుండా విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయడం పట్ల ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు.

ముంజేటి జగన్మోహన్‌రావు, ముంజేటి పురుషోత్తమరావు తహశీల్దార్‌తో మాట్లాడుతూ సర్పంచ్ వియ్యపు లావణ్య చక్రపాణి సర్వే నెంబర్ 15/3లో మజ్జి రాముడుపేట గ్రామం వద్ద పాపి గాని చెరువులో 90 సెంట్లు ఆక్రమించుకుని రూ. 2కోట్లుకు అమ్మేశారని ఆరోపించారు. ఉంగరాడ మెట్ట వద్ద వాటర్ ప్లాంట్ ఎదురుగా సర్వే నెంబరు ఒకటిలో మరో 90 సెంట్లు భూమి ఆక్రమణ చేసి రెండు షాపులు నిర్మాణాలు చేసి 35 లక్షల రూపాయలకు అమ్మకాలు జరిపారని ఫిర్యాదు చేశారు. మరికొంత భూమ్మీద పునాదులు వేశారని వెల్లడించారు. యాతపేట కాలనీ వెనుక ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి కాలనీ ఇప్పిస్తామని రూ.10వేలు నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్వే నెంబరు 1/5 లో కొండ ప్రభుత్వ భూమిలో తన సొంతంగా ఉన్న జెసిబితో తవ్వి ట్రాక్టర్లతో రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా కొండ కంకర అక్రమంగా అమ్మకాలు జరుపుతున్నట్లు చెప్పారు. కొండల మామిడి వలస బస్ స్టేషన్ వెనుక భాగంలో జగనన్న కాలనీలో కొండ కంకర అక్రమంగా అమ్మకాలు జరుపుతున్నట్లు వెల్లడించారు.

చల్ల రామి నాయుడు జిరాయితి భూమిని రికార్డులు తారుమారు చేసి 50 సెంట్లు రాసుకున్నట్లు వెల్లడించారు. సర్పంచ్ ప్రభుత్వ సంపద భూకబ్జాలు చేసి లక్షలు గడించి ఇబ్బందులు పెడుతున్నట్లు ఆ ఫిర్యాదుల పేర్కొన్నారు. ఈ రెండు ఫిర్యాదులను తహశీల్దారు స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డుపైకి వాడుక నీరొస్తే చర్యలు

ప్రజాశక్తి - వేపాడ

రోడ్డుపై మురుగను పరిశీలిస్తున్న ఉమా

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపైకి మురుగునీరు వచ్చి నిల్వ ఉండి పోయిందని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇఒపిఆర్‌డి ఉమా సోమవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాడుక నీరు రోడ్డుపైకి వస్తే చర్యలు తీసుకుంటా మన్నారు. రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం, చిరు దుకాణాల వల్ల వచ్చే ప్లాస్టిక్ గ్లాసులు, తినుబండరాలు కాలువల్లో వేయడం వల్ల పూడికలు పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపైకి వచ్చేస్తుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వైన్ షాప్ యజమాని, చిరు దుకాణదారుడు చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జెసిబితో కాలువలో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి గౌరీకి ఆదేశించారు. ఈ పరిశీలనలో వార్డు మెంబర్ మెలిపాక రమణ, వి అప్పారావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పారిశుధ్యం పనులు పరిశీలన

మండలంలోని వల్లంపూడి గ్రామంలో మూడు రోజులుగా కొనసాగుతున్న పారిశుధ్యం పనులను ఇఒపిఆర్‌డి ఉమా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డునకు ఇరువైపులా ఉన్న ఇళ్లకు సంబంధించిన వారంతా చెత్తను బుట్టలో వేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. ఈ పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక ఇంది రమ్మ కాలనీలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్లనే ప్రమా దాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ వున్నవారు మాత్రమే వాహనాలను నడపాలన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల న్నారు. వాహనాలకు అనుమతి పత్రాలు, భీమా లేకపోతే సీజ్ చేస్తామన్నారు. నిబంధనలు పాటిం చని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకు న్నారు. వాహన తనిఖీలో ఎస్ఐలు లోవరాజు, సత్యనారాయణ, ఏఎస్ఐ భాస్కరరావు, కానిస్టేబు ల్స్ పాల్గొన్నారు.

ఎన్నికల ఫలితాల వేళ ప్రశాంతతతో ఉండాలి: డిఎస్‌పి

రామభద్రపురం: ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి ఇంకా ఫలితాలు జూన్ 4 న వెలువడనున్నాయనీ ఆరోజు వరకు ప్రజలంతా ప్రశాంతంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ ఆధ్వర్యంలో రొంపల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఇంకా అమల్లోనే ఉందని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ నిబంధనలు మేరకు ప్రజలంతా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఎన్నికల అనంతరం ఫలితాల వరకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలకూ తావియ్యక సోదర భావంతో ఇరు పార్టీలు నడుచుకోవాలని హితవుపలికారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఫలితాలు వచ్చిన తరువాత కూడా విజయోత్సవాల పేరిట రెచ్చ గొట్టే విధంగా ప్రవర్తించినా, అనుమతులు లేకుండా ర్యాలీలు, బాణాసంచా పేలుళ్ల వంటివి నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓట్లు లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ

ప్రజాశక్తి- బొబ్బిలి

జూన్ 4న జరగనున్న ఓట్లు లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్ఒ ఎ.సాయిశ్రీ చెప్పారు. తన కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న బొబ్బిలి నియోజకవర్గం ఓట్లు లెక్కింపు విజయనగరం జెఎన్‌టియులో జరుగుతుంద న్నారు. అసెంబ్లీ ఓట్లు లెక్కింపునకు 14 టేబుల్స్, పార్లమెంట్ ఓట్లు లెక్కింపునకు మరో 14 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 19 రౌండ్లలో ఓట్లు లెక్కింపు పూర్తి అవుతుందన్నారు. సర్వీస్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు జూన్ 4 ఉదయం 8గంటల లోపు వచ్చిన ఓట్లను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. సర్వీస్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 930కు 353 ఓట్లు పోస్టల్ ద్వారా వచ్చాయని చెప్పారు. ఓట్లు లెక్కింపునకు వచ్చే ఏజెంట్లు, అధికారులను మూడు చోట్ల తనిఖీ చేసిన తర్వాత కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తారని చెప్పారు.

వైభవంగా ధారగంగమ్మ తల్లి తొలేళ్లు ఉత్సవం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోట గ్రామదేవత దార గంగమ్మ తల్లి తోలేళ్ల పండగ సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి అగ్నిహోత్రం రాజగోపాలాచారి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసింది. తోలేళ్ల పండగ సంప్రదాయం ప్రకారం కల్లుగీత కార్మికుల సామాజిక వర్గం ఇంటి నుంచి ధాన్యం, పద్మశాలి సామాజిక వర్గం ఇంటి నుంచి నేత వస్త్రం తీసుకొచ్చి ఆలయ అనువంశిక పూజారి మాపాడ గౌరీ నాయుడుకు అందించారు. ఆయన ఆ వస్త్రాన్ని తలకు చుట్టుకొని ధాన్యాన్ని గాంధీ బొమ్మ కూడలి సమీపంలో ఉన్న పాండవుల చావిడ వద్ద గుట్టగా పోశారు. పూజలు అనంతరం రైతులు పిడికిడి ధాన్యం చొప్పున ఇంటికి తీసుకువెళ్లారు.

ఈ ధాన్యాన్ని ఖరీఫ్ విత్తనాలతో కలిపి జల్లితే పంటలు బాగా పండితాయని అన్నదాతల నమ్మకం. అనుపోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అనువంశిక పూజారి ఇంటి నుంచి ఊరేగింపుగా వన్నే ట్రాఫిక్, ప్రధాన రహదారి, మనసబ్ వీధి, పెద్దవీధి, కాపు వీధి, దేవి గుడి కూడలి మీదగా పుణ్యగిరి రోడ్డులోని అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. రెండేళ్లకు ఒకసారి జరిగే పండగ కావడం వల్ల యాత్రికలతో పట్టణం కిటకిటలాడుతుంది.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కొత్తవలస

పతకాలు సాధించిన విద్యార్థులు

విజయనగరంలోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కరాటే పోటీల్లో స్థానిక కరాటే ఒకినావా ఫోర్స్ అకాడమీ నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలో కె .లక్ష్మీ దీపక్ గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించగా కె.జయశ్రీ రెండు బంగారు పతకాలు, పి.నాగ వెంకట వంశీ గోల్డ్, బ్రాంజ్ మెడల్, కె.బాలాజీ. సిల్వర్, పి.గౌరీ ప్రసన్న బ్రాంజ్, సిల్వర్ మెడల్, సాయి సిల్వర్, బ్రాంజ్ మెడల్‌ను వివిధ విభాగాల్లో సాధించారు. వీరిని బ్లాక్ బెల్ట్ యువత ఎల్. సురేష్, జి.రాజు, ఎం.నరేంద్ర, కోచ్ కె.సూర్యనూకరాజు అభినందించారు.

నేరాలు ఘోరాలు

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.. మూడేళ్ల పాటు బాగానే ఉన్నారు. గడిచిన ఆరు నెలల కాలం నుంచి భార్య తాను చెప్పిన మాట వినడం లేదంటూ తనలో కోపాన్ని పెంచుకొని రాక్షసుడిగా మారాడు. పుట్టింటికి వెళ్లిన భార్యను తీసుకువచ్చి మరి దారుణంగా చంపేసిన ఘటన మండలంలోని ఒడ్డుమరిపల్లి గ్రామం వద్ద జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి సిఐ మురళి రావు మృతురాలి తల్లిదండ్రులు గుగ్గి రాము, కృష్ణమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడ్డుమరిపల్లి గ్రామానికి చెందిన చీమల కనకారావు గుగ్గి దారప్పను నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఏడాది బాబు ఉన్నాడు. దారప్ప ఏడాదిగా లచ్చన్న దొరపాలెంలో ఉన్న హోటల్లో పని చేస్తుంది. దీనిని మానివేయాలని గడిచిన ఆరు నెలలుగా ఆమె భర్త కోరుతున్నాడు. దీన్ని దారప్ప నిరాకరించింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవలు పెరిగాయి. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం కనకారావు ఇంటికి వెళ్లి దారప్పను బాగా చూసుకుంటానని ఆమె తల్లిదండ్రులకు మాటిచ్చి తీసుకెళ్లాడు. తర్వాత గ్రామ సమీపంలో ఉన్న జీడి తోట వద్ద మరోసారి ఇద్దరికీ గొడవ జరిగింది. దీంతో ఆమె చున్నీతో పీక బిగించి చంపేశాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని గ్రామ సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి కింద ఉన్న తుప్పల్లో పడేశాడు. తన వెంట తీసుకెళ్లిన తన కుమార్తె ఎంతకూ ఇంటికి రాకపోవడంతో ఆదివారం రాత్రి నుంచి తన అల్లుడును అడిగారు. చివరికి సోమవారం తాను తన భార్యను చంపేశానని చెప్పి చంపిన ప్రదేశాన్ని చూపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో తాను సంఘటనా స్థలానికి చేరుకున్నాని సిఐ మురళి రావు తెలిపారు. అనంతరం తహశీల్దార్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పంచనామా చేసి మృతదేహాన్ని ఎస్ కోట సిహెచ్‌సికి తరలించారు. ఎప్పుడు లేని విధంగా తమ గిరిజన గ్రామంలో ఇటువంటి సంఘటన జరగడంతో గిరిజనులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. హంతకుడుని అదుపులోకి తీసుకున్నామని సిఐ తెలిపారు.

ఆస్పత్రి వద్ద గిరిజనుల ధర్నా

పోస్టు మార్టం నిమిత్తం ఎస్‌కోట ఏరియా ఆస్పత్రి వద్దకు దారప్ప మృత దేహాన్ని ఉదయం 10గంటలకు తరలించినా సాయంత్రం వరకూ పోస్టు మార్టం చేయలేదు. దీంతో గిరిజనులు పెద్ద ఎత్తున ఆస్పత్రి వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. డ్యూటీ డాక్టర్ స్పందిస్తూ మంగళవారం ఉదయం చేస్తామని చెప్పారు. అయితే ఈ విషయం ఉదయం ఎందుకు చెప్పలేదని గిరిజనులు ప్రశ్నించారు.

దుకాణాలపైకి దూసుకెళ్లిన భారీ క్రేన్

ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు

ప్రజాశక్తి - కొత్తవలస

ధ్వంసమైన దుకాణం

కొత్తవలస జంక్షన్‌లో సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఎటువంటి ప్రాణానష్టం లేకపోయినప్పటికీ ఆస్తి నష్టం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రం విశాఖ - అరకు ప్రధాన రహదారిలో ఉన్న మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ ఎదురుగా సోమవారం ఎపి31 డిటి4691 నెంబరు గల భారీ క్రేన్ విశాఖపట్నం వైపు నుంచి ఎల్‌కోట మండలంలో గల మహామాయ కర్మాగారానికి వెళుతుంది. ఈ వాహనం కొత్తవలస మార్కెట్ కమిటీ చెక్ పోస్ట్ వద్దకు వచ్చేసరికి దానికి ముందు బాగానే వెళ్తున్న ఆటోని గమనించకుండానే అత్యంత వేగంగా దూసుకెళ్లింది. వేగాన్ని నియంత్రించలేక రోడ్డు పక్కనే ఆటో మెకానిక్ షాప్ వద్ద చిరు వ్యాపారం చేసుకునే వారిపై దూసుకెళ్లింది. దీంతో షాపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇందులో కొత్తవలస మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదానికి క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణమని స్థానికులు అంటున్నారు. ఈ క్రేనుకు ముందు భాగాన వెళుతున్న వాహనాలను గమనించకుండానే అత్యంత వేగంగా డ్రైవింగ్ చేయడం వల్లనే ఈ ప్రమాదం సంభవించిందని, ఉదయం ఏడున్నర గంటలు సమయం కావటం, ఆటో మెకానిక్ షాపులు తెరిచి ఉండకపోవటం వల్లనే షాపులు ధ్వంసమై ప్రాణానిష్టం తప్పిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. క్రేన్ యజమానులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులు పోలీస్ స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదులూ చేయకుండానే రోడ్డు పైనే పంచాయతీ సెటిల్మెంట్ చేసుకొని సంఘటనా స్థలం నుండి ఉడాయించారు.

**మహారాజశ్రీ విజయనగరం జిల్లా
సీనియర్ సివిల్ జడ్జికోర్టు విజయనగరం
O.S.15/2022**

Between :
కెల్ల అప్పల కొండమ్మ .....Plaintiff
And :
బూడి అప్పలస్వామి వగైరాలు .....Defendants
To:-
1. బూడి అప్పలనాయుడు, S/o లేటు నారాయణప్పడు, వయస్సు 60 సం॥, R/o రాజావీధి, గాజులరేగ, విజయనగరం మండలం మరియు జిల్లా.
2. బూడి చంద్రవతి W/o. లేటు లక్ష్మణ్ @ లక్ష్మణరావు, వయస్సు 60 సం॥ - R/o do -
3. మంత్రి లక్ష్మి, W/o నారంనాయుడు, వయస్సు 40 సం॥ - R/o do -
4. బూడి అచ్చియ్యమ్మ W/o లేటు సూర్యనారాయణ, వయస్సు 65 సం॥ R/o - do -
5. బూడి ముత్యాలనాయుడు, S/o లేటు సూర్యనారాయణ, వయస్సు 40సం॥, R/o - do -
6. బూడి మాధవి, W/o లేటు ఉగాది, వయస్సు 48 సం॥ r/o సాయి సౌజన్య కెస్టల్, 1st ఫ్లోర్, కొత్త అగ్రహారం, విజయనగరం.
7. బూడి జయ సూర్య సత్య సాయి ప్రసాద్ S/o లేటు ఉగాది, వయస్సు 26 సం॥ R/o - do -
8. బూడి గాయిత్రి, D/o లేటు ఉగాది, వయస్సు 28 సం॥, R/o - do -
9. బూడి వరలక్ష్మి, W/o లేటు శ్రీను, వయస్సు 35 సం॥ r/o డోర్ నెం. 13-60, రాజావీధి, గాజులరేగ, విజయనగరం మండలం మరియు జిల్లా.
10. బూడి పూజిత, D/o లేటు శ్రీను, వయస్సు 14 సం॥, R/o - do -
11. బూడి నీలిమ D/o లేటు శ్రీను, వయస్సు 12 సం॥, R/o - do -

పై నెంబరు గల కోర్టుయందు వాది/ప్లెయింటిప్ దావా నమోదు చేయగా శ్రీ కోర్టువారు వాదికి ఆర్డరు జారీ చేసిన ప్రకారం పలుమార్లు నోటీసులు పంపించిననూ మీరు తీవ్ర జాప్యం చేయడం వలన తిరస్కరించుట వలన తేది 21-06-2024న వాయిదా కలదని ఈ నోటీసు పత్రికా ముఖంగా మీకు తెలియజేయమని శ్రీ కోర్టువారు ఆర్డరు వేసియున్నారు. కావున వాయిదా రోజున అనగా **తేది 21-06-2024 ఉదయం 10-30 ని॥లకు** మీరుగాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేనియెడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షమున తీర్మానించుదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు
కె.రవిబాబు,
అడ్వకేట్, విజయనగరం,
సెల్ : 9440343921